నందిని పసిడి వెలుగు

హెప్టాథ్లాన్‌లో అద్భుత ప్రదర్శనతో అగ్రస్థానం • సత్తాచాటిన తెలంగాణ అథ్లెట్

భువనేశ్వర్: ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్స్ టోర్నీలో తెలంగాణ స్టార్ అథ్లెట్ అగసర నందిని పసిడి కాంతులు విరజిమ్మింది. అంచనాలను తలక్రిందులు చేస్తూ అద్భుత ప్రదర్శన కనబరిచిన నందిని స్వర్ణ పతకాన్ని సగర్వంగా ముద్దాడింది. రెండు రోజుల పాటు జరిగిన హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో మొత్తం 5460 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. అనామిక(4997, కేరళ), దీపిక(4817, తమిళనాడు) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. తొలుత మంగళవారం జరిగిన నాలుగు ఈవెంట్లలో నందిని తనదైన ఆధిపత్యం ప్రదర్శించింది. 100మీటర్ల హర్డిల్స్ రేసును ఈ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థి 14.21సెకన్లలో ముగించి పతక పోటీని ఘనంగా ప్రారంభించింది. ఆ తర్వాత జరిగిన హైజంప్‌లో 1.64మీటర్ల ఎత్తు దూకింది. షాట్‌పుట్‌లో 12.23మీటర్లు, 200మీటర్ల రేసును 25.23 సెకన్లలో ముగించింది. బుధవారం జరిగిన మిగతా మూడు ఈవెంట్లలోనూ నందిని తన జోరును కనబరిచింది. లాంగ్‌జంప్‌లో 5.64మీటర్లు, జావెలిన్‌త్రోలో 41.13మీటర్లు, 800మీటర్ల రేసును 2:25:06సెకన్లలో ముగించి నంబర్‌వన్‌లో నిలిచింది. మొత్తం ఏడు ఈవెంట్లు కలిపి 5వేలకు పైగా పాయింట్లను ఖాతాలో వేసుకుంది.

ఫెడరేషన్ కప్ సీనియర్‌టోర్నీలో పసిడి పతకం సాధించడం చాలా గర్వంగా ఉంది. ఓవైపు గాయం బాధిస్తున్నా..ప్రతీ పోటీలో ప్రత్యర్థులకు దీటైన పోటీనిచ్చాను. ఏడు ఈవెంట్లలో మెరుగైన ప్రదర్శన కనబరిచి అగ్రస్థానంలో నిలిచాను. వచ్చే నెలలో పంచకులలో జరుగనున్న టోర్నీలోనూ రాణించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తానన్న ఆత్మవిశ్వాసం నాకుంది. **- నందిని**

నీరజ్‌కే అగ్రస్థానం

భువనేశ్వర్: మూడేండ్ల తర్వాత స్వదేశంలో సొంత ప్రేక్షకుల మధ్య బరిలోకి దిగిన టోక్యో ఒలింపిక్స్ 'గోల్డెన్ బాయ్' నీరజ్ చోప్రా.. ఫెడరేషన్ కప్‌లో సత్తా చాటాడు. బుధవారం రాత్రి కళింగ స్టేడియం వేదికగా జరిగిన జావెలిన్ త్రో ఫైనల్‌లో నీరజ్.. బరిసెను 82.27 మీటర్ల దూరం విసరడంతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం సాధించాడు. తొలి ప్రయత్నంలో అతడు 82 మీటర్లే విసిరాడు. అయితే డీపీ మను 82.06 మీటర్లతో అతడిని అధిగమించాడు. కానీ చోప్రా నాలుగో ప్రయత్నంలో 82.27 మీటర్లతో అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. డీపీ మను (82.06) రజతం నెగ్గగా 78.39 మీటర్లతో ఉత్తమ్ పాటిల్ కాంస్యం గెలుచుకున్నాడు. లోకల్ బాయ్ కిశోర్ జెన 75.25 మీటర్లతో ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఇటీవలే ముగిసిన దోహా డైమండ్ లీగ్‌లో జావెలిన్‌ను 88.36 మీటర్ల దూరం విసిరి 0.2 సెంటిమీటర్ల తేడాతో అగ్రస్థానం కోల్పోయిన చోప్రా తాజాగా స్వర్ణం నెగ్గినా అతడి ప్రదర్శన మాత్రం ఆశించిన స్థాయిలో లేదు.

సచిన్ సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య

ముంబై: భారత క్రికెట్ జట్టు దిగ్గజం సచిన్ టెండూల్కర్ భద్రతా సిబ్బందిలో సెక్యూరిటీ గార్డ్‌గా ఉన్న ప్రకాశ్ కాప్డే అనే జవాన్ ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. స్టేట్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (ఎస్ఆర్‌పీఎఫ్) జవాన్ అయిన ప్రకాశ్.. బుధవారం తెల్లవారుజామున స్వగ్రామం (జమ్మేర్)లో తన సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్టు పోలీసులు తెలిపారు. కొద్దిరోజులుగా సెలవుల నిమిత్తం జమ్మేర్‌కు వెళ్లిన ప్రకాశ్ బలవన్మరణం పాల్పడటానికి గల కారణాలు తెలియరాలేదు.

అభిషేక్ ఒక్కడే..

అస్తానా: కజకిస్థాన్ వేదికగా జరుగుతున్న ఎలోర్డా కప్ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్ అభిషేక్ యాదవ్ సెమీస్‌కు దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల 67 కిలోల క్వార్టర్స్ విభాగంలో అభిషేక్.. 5-0 తేడాతో కజకిస్థాన్‌కే చెందిన రఖత్‌పై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాడు. కానీ పవన్ (54 కిలోలు), కవిందర్ సింగ్ (57 కిలోలు) క్వార్టర్స్‌లోనే ఇంటిబాట పట్టారు.

రాయల్స్‌కు ఝలక్

సామ్ కరన్ ఆల్‌రౌండ్ షో

రాజస్థాన్‌కు వరుసగా నాలుగో ఓటమి • లో స్కోరింగ్ థ్రిల్లర్‌లో పంజాబ్‌దే పైచేయి

ఐపీఎల్-17లో ప్లేఆఫ్స్ చేరిన రాజస్థాన్ రాయల్స్ టాప్-2లో నిలిచే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదంలో పడింది. బుధవారం గువహటి వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన లో స్కోరింగ్ థ్రిల్లర్‌లో 5 వికెట్ల తేడాతో ఓడిన ఆ జట్టు.. వరుసగా నాలుగో ఓటమిని మూటగట్టుకుంది. బ్యాటింగ్‌లో విఫలమైన ఆ జట్టు బౌలింగ్‌తో స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకునే యత్నం చేసినా పంజాబ్ సారథి సామ్ కరన్ ఆల్‌రౌండ్ షోతో రాయల్స్‌కు షాకిచ్చాడు.

గువహటి: ఇప్పటికే ప్లేఆఫ్స్ బెర్తును దక్కించుకున్న రాజస్థాన్ రాయల్స్.. పంజాబ్ కింగ్స్‌తో నామమాత్రపు మ్యాచ్‌లో తడబడింది. గువహటి వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ చేతిలో 5 వికెట్ల తేడాతో ఓడింది. ఇరు జట్ల బ్యాటర్లు తడబడి బౌలర్లకు అనుకూలించిన బర్సపర పిచ్‌పై మొదట బ్యాటింగ్ చేసిన రాయల్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 144/9 పరుగులు మాత్రమే చేయగలిగింది. టాపార్డర్ విఫలమైనా 'లోకల్ బాయ్' రియాన్ పరాగ్ (34 బంతుల్లో 48, 6 ఫోర్లు) ఆ జట్టును ఆదుకున్నాడు. సామ్ కరన్ (2/24), హర్షల్ పటేల్ (2/28), చాహర్(2/26) రాజస్థాన్‌ను కట్టడిచేశారు. అనంతరం స్వల్ప ఛేదనలో పంజాబ్ కూడా తడబడింది. కానీ బంతితో రాణించిన కెప్టెన్ కరన్ (41 బంతుల్లో 63 నాటౌట్, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించడంతో ఆ జట్టు 18.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కరన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

ఆదుకున్న పరాగ్

మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ ఇన్నింగ్స్ నెమ్మదిగా సాగింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (4) తొలి ఓవర్లోనే నిష్క్రమించగా కోహ్లర్ కడ్మోర్ (18) ధాటిగా ఆడలేకపోయాడు. కెప్టెన్ శాంసన్(18) మూడు సిక్సర్లతో దూకుడు మీద కనిపించినా అతడూ ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. 42 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన పంజాబ్‌ను పరాగ్-అశ్విన్ (19 బంతుల్లో 28, 3 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకున్నారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 50 పరుగులు జోడించారు. పరాగ్ మరోసారి ఆపద్బాంధవుడి పాత్ర పోషించడంతో రాజస్థాన్ గౌరవప్రదమైన స్కోరుచేసింది. జురెల్ డకౌట్ అవగా పావెల్ (4), ఫెరీరా (7) విఫలమయ్యారు.

కరన్ పోరాటం..

స్లో వికెట్‌పై పంజాబ్ బ్యాటర్లూ తడబడ్డారు. భారీ హిట్టర్లు కలిగిన పంజాబ్ ఇన్నింగ్స్ నత్తకు నడక నేర్పినట్టు సాగింది. బౌల్ట్ తొలి ఓవర్లోనే ప్రభ్‌సిమ్రన్ (6) వికెట్ కోల్పోయినా 5 ఫోర్లు కొట్టిన రూసో పంజాబ్ స్కోరు వేగాన్ని పెంచే యత్నం చేశాడు. కానీ అవేశ్ ఖాన్ ఒకే ఓవర్లో రూసో(13 బంతుల్లో 22, 5 ఫోర్లు), శశాంక్ (0)ను ఔట్ చేయగా బెయిర్ స్టో(14)ను చాహల్ పెవిలియన్‌కు పంపాడు. 5-11 ఓవర్ల మధ్య పంజాబ్‌ను రాయల్స్ బౌలర్లు కట్టడి చేయడంతో ఆ జట్టు 31 పరుగులే చేయగలిగింది. కానీ కెప్టెన్ కరన్, జితేశ్ శర్మ (22) పోరాటం పంజాబ్‌ను పోటీలోకి తెచ్చింది. ఆఖర్లో కాస్త ఉత్కంఠ రేగినా కరన్, అశుతోష్ (17 నాటౌట్) మెరుపులతో పంజాబ్ విజయాన్ని పూర్తిచేశారు.

సంక్షిప్త స్కోర్లు

రాజస్థాన్: 20 ఓవర్లలో 144/9 (పరాగ్ 48, అశ్విన్ 28, కరన్ 2/24, హర్షల్ 2/28). **పంజాబ్:** 18.5 ఓవర్లలో 145/5 (కరన్ 63 నాటౌట్, రూసో 22, అవేశ్ 2/28, చాహల్ 2/31)

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ఫ.తే.	ర	పా
కోల్‌కతా ✓	13	9	3	1	1.42	19
రాజస్థాన్ ✓	13	8	5		0.27	16
చెన్నై	13	7	6		0.52	14
హైదరాబాద్	12	7	5		0.40	14
ఢిల్లీ	14	7	7		-0.37	14
బెంగళూరు	13	6	7		0.38	12
లక్నో	13	6	7		-0.78	12
గుజరాత్ X	13	5	7	1	-1.06	11
పంజాబ్ X	13	5	8		-0.34	10
ముంబై X	13	4	9		-0.27	8

నోట్: జ:జట్టు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు ఫ.తే. : ఫలితం తేలనివి.

పనిచేసే ఆడవాళ్ల వల్లే ఈ దుస్థితి

పాక్ మాజీ క్రికెటర్ అన్వర్ వివాదాస్పద వ్యాఖ్యలు

కివీస్ సారథినీ వివాదంలోకి లాగిన వైనం

ఇస్లామాబాద్: మహిళా సాధికారత, స్త్రీ ఆర్థిక స్వేచ్ఛపై పాకిస్థాన్ మాజీ క్రికెటర్ సయీద్ అన్వర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ఇంట్లో ఉండాల్సిన ఆడవాళ్లు బయటకు వచ్చి ఉద్యోగాలు చేయడం వల్లే సమాజానికి ఈ దుస్థితి తలెత్తిందని మాట్లాడిన వీడియో ఒకటి ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. వీడియోలో అన్వర్.. 'కొంతకాలంగా నేను ప్రపంచవ్యాప్తంగా తిరుగుతున్నాను. కొద్దిరోజుల క్రితమే ఆస్ట్రేలియా, యూరప్ నుంచి వచ్చాను. యువకులు కుంగుబాటుకు లోనవుతున్నారు. కుటుంబాలు ఛిద్రమైపోతున్నాయి. భార్యభర్తలు గొడవలు పడుతున్నారు. డబ్బు కోసం మహిళలను పనికి పంపించడం వల్లే ఇదంతా..' అని వ్యాఖ్యానించిన అతడు.. ఈ వివాదంలోకి కివీస్ సారథి కేన్ విలియమ్సన్‌నూ లాగాడు. ''ఇదే విషయమై న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ నాకు ఫోన్ చేసి 'ఈ సమస్యను ఎలా పరిష్కరించాలి' అని అడిగాడు. 'మా మహిళలు పనిచేయడానికి బయటకు వచ్చిన తర్వాతే మా సంస్కృతి నాశనమైందని ఒక ఆస్ట్రేలియా మేయర్ నాతో అన్నాడు'' అంటూ అన్వర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. పాకిస్థాన్‌లో గత కొన్నాళ్లుగా విడాకుల సంఖ్య పెరగడానికి కూడా ఇదే కారణమని అన్వర్ అక్కసు వెళ్లగక్కాడు. అన్వర్ వ్యాఖ్యలపై నెటిజనులు, స్త్రీవాదులు మాత్రం తీవ్రంగా మండిపడుతున్నారు.

ప్రిక్వార్టర్స్‌కు సాత్విక్-చిరాగ్ జోడీ

• థాయ్‌లాండ్ ఓపెన్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ తొలి రోజు భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు దక్కాయి. స్టార్ డబుల్స్ పెయిర్ సాత్విక్-చిరాగ్ ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లగా సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్, కిరణ్ జార్జి తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. పురుషుల డబుల్స్‌లో టాప్ సీడ్స్ సాత్విక్-చిరాగ్.. 21-13, 21-14 తేడాతో మలేషియా ద్వయం మహ్మద్ అజ్రిన్ అయూబ్-తాన్ వీ కియోంగ్ కథనం 34 నిమిషాల్లోనే ముగించారు. పురుషుల సింగిల్స్‌లో భారత్‌కే చెందిన యువ సంచలనం మీరబలువాంగ్.. 21-19, 21-18తో ప్రణయ్‌కు షాకిచ్చాడు. కిరణ్ జార్జి 15-21, 21-13, 17-21 తో క్రిస్టోఫెర్సెన్ (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడాడు. ప్రిక్వార్టర్స్‌లో లువాంగ్.. క్రిస్టోఫెర్సెన్‌తో తలపడాల్సి ఉంది. మహిళల సింగిల్స్‌లో అష్మిత చాహిల.. 19-21, 21-15, 21-14 తో ఈస్టర్ నురుమి (ఇండోనేషియా)ను ఓడించింది. మాళవిక బన్సోద్, ఉన్నతి హుడా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు.

ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు పెంచిన ఎస్బీఐ

75 బేసిస్ పాయింట్ల వరకు సవరించిన బ్యాంక్

న్యూఢిల్లీ, మే 15: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) డిపాజిట్ దారులకు శుభవార్తను అందించింది. ఎంపిక చేసిన డిపాజిట్లపై వడ్డీరేట్లను 75 బేసిస్ పాయింట్ల వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. రూ.2 కోట్ల లోపు రిటైల్, బల్క్ డిపాజిట్లపై ఈ పెంపు వర్తించనున్నదని తెలిపింది. పెరిగిన వడ్డీరేట్లు బుధవారం నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. స్వల్పకాలంలో డిపాజిట్లు చేసేవారికి ఊరటను కల్పించే ఉద్దేశంలో భాగంగా బ్యాంక్ 46 రోజుల నుంచి 179 రోజుల లోపు డిపాజిట్లపై వడ్డీని 75 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో డిపాజిట్లపై వడ్డీరేటు 4.75 శాతం నుంచి 5.5 శాతానికి చేరుకున్నది. అలాగే 180 రోజుల నుంచి 210 రోజుల డిపాజిట్లపై వడ్డీరేటును పావు శాతం సవరించడంతో రేటు 5.75 శాతం నుంచి 6 శాతానికి చేరుకోగా, అలాగే 211 రోజుల నుంచి ఏడాది లోపు టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేట్లను పావు శాతం పెంచడంతో 6 శాతం నుంచి 6.25 శాతానికి చేరుకున్నది. సీనియర్ సిటిజన్లకు కూడా ఇంతే స్థాయిలో వడ్డీరేట్లను సవరించింది బ్యాంక్.

రూ.2 కోట్లలోపు డిపాజిట్లపై పెరిగిన ఎస్బీఐ వడ్డీరేట్లు(శాతంలో)

కాల పరిమితి	జనరల్ పబ్లిక్	సీనియర్ సిటిజన్లు
7-45 రోజులు	3.5	4
46-179 రోజులు	5.5	6
180-210 రోజులు	6	6.5
211-ఏడాది	6.25	6.75
ఏడాది-రెండేండ్లు	6.8	7.3
రెండేండ్లు-మూడేండ్లు	7	7.5
మూడేండ్లు-ఐదేండ్లు	6.75	7.25
ఐదేండ్లు-పదేండ్లు	6.5	7.50

12.50 లక్షల కోట్లు రైటాఫ్

మోదీ హయాంలో భారీగా రుణాలను వదిలించుకున్న సర్కారీ బ్యాంకులు

న్యూఢిల్లీ, మే 15: కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకులు రైటాఫ్ చేసిన రుణాల విలువ దాదాపు రూ.12.50 లక్షల కోట్లుగా ఉన్నది. 2014-15 నుంచి 2018-19 మధ్యనున్న తొలి ఐదేండ్ల కాలంలో రూ.6,24,370 కోట్ల రుణాలను రైటాఫ్ చేసిన సర్కారీ బ్యాంకులు.. 2019-20 నుంచి 2023-24 మధ్యనున్న తర్వాతి ఐదేండ్లలో మరో రూ.6,14,443 కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయి. ఇందులో ఎక్కువభాగం రుణాలు కార్పొరేట్లకు చెందినవే కావడం గమనార్హం. ఇక ఈ మొత్తం రైటాఫ్ జరిగిన రుణాల్లో సగభాగం భారీ పరిశ్రమలు, సేవల రంగానికి చెందిన సంస్థలవే ఉన్నాయని పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖే చెప్పింది.

గత ఆరేండ్లలో టాప్ 10 ప్రభుత్వ రంగ బ్యాంకుల రుణాల రైటాఫ్ (రూ.కోట్లలో)

బ్యాంకులు	2023-24	2022-23	2021-22	2020-21	2019-20	2018-19
బీవోబీ	10,518	17,998	17,967	14,878	15,806	19,292
బీవోఐ	9,749	8,655	10,324	8,732	7,628	7,417
సెంట్రల్ బ్యాంక్	10,001	10,258	1,236	5,992	4,169	10,375
ఇండియన్ బ్యాంక్	8,721	8,241	8,347	8,427	12,112	2,874
ఐవోబీ	7,214	3,412	3,769	4,618	16,407	7,683
పీఎస్‌బీ	755	2,128	1,050	71	1,780.87	1,635.04
పీఎన్‌బీ	16,257	16,578	21,999	17,535	13,365	12,253
ఎస్బీఐ	8,595	15,729	12,696	17,590	12,549	17,782
యూకో బ్యాంక్	1,938	2,575	3,851	9,411	12,479	-
యూబీఐ	18,264	19,175	19,484	16,984	16,425	7,771
మొత్తం	**92,012**	**1,04,749**	**1,00,723**	**1,04,238**	**1,12,721**	**87,082**

సామాన్యులపైనే ప్రతాపం

తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించని సామాన్యులపై కొరడా ఝుళిపిస్తున్న బ్యాంకులు.. కార్పొరేట్లకిచ్చిన లక్షల కోట్ల రుణాలను రైటాఫ్‌ల పేరిట ఖాతా పుస్తకాల్లో నుంచి వదిలించుకుంటున్నాయి. ఒక్క ఈఎంఐ (నెలవారీ కిస్తీ) చెల్లించకపోయినా వందలసార్లు.. సగటు రుణగ్రహీతను హెచ్చరిస్తున్న బ్యాంకర్లు.. ఏండ్ల తరబడి కార్పొరేట్లకే వత్తాసు పలుకుతున్నాయని, ఈ రకమైన తీరు బ్యాంకింగ్ రంగాన్ని, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉనికినే చివరకు ప్రమాదంలో పడేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- *2004-05 నుంచి 2013-14 మధ్య పదేండ్ల యూపీఏ (కాంగ్రెస్) హయాంలో రూ.2,20,328 కోట్ల మొండి బకాయిలను రైటాఫ్ చేసిన భారతీయ బ్యాంకులు. ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటా రూ.1,58,994 కోట్లు.*
- *2014-15 నుంచి 2023-24 మధ్య పదేండ్ల ఎన్‌డీఏ (బీజేపీ) హయాంలో దాదాపు రూ.16 లక్షల కోట్ల మొండి బకాయిలను రైటాఫ్ చేసిన దేశీయ బ్యాంకులు. ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటా రూ.12,38,813 కోట్లు.*
- *భారీ ఎత్తున రుణాలను రైటాఫ్ చేస్తుండటం వల్లే బ్యాంకుల ఎన్‌పీఏలు దాదాపు సగం తగ్గుముఖం పట్టాయంటున్న రిజర్వ్‌బ్యాంక్ గణాంకాలు.*

భగ్గుమన్న వాణిజ్య లోటు

నాలుగు నెలల గరిష్ఠానికి చేరిక.. ఏప్రిల్‌లో 19 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ, మే 15: ఎగుమతులు నీరసించాయి. గత కొన్ని నెలలుగా రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్న ఎగుమతులు గత నెలలో సింగిల్ డిజిట్‌కు పరిమితమయ్యాయి. ఏప్రిల్ నెలలో దేశీయ ఎగుమతులు ఒక్క శాతం వృద్ధితో 34.99 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే నెలలో భారత్ 54.09 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నది. దీంతో వాణిజ్యలోటు(దిగుమతులు, ఎగుమతుల మధ్య వ్యత్యాసం) నాలుగు నెలల గరిష్ఠ స్థాయిని తాకి 19.1 బిలియన్ డాలర్లుగా నమోదైంది. డిసెంబర్ 2023లో నమోదైన 19.8 బిలియన్ డాలర్ల తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి కావడం విశేషం. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఏప్రిల్ 2023లో వాణిజ్యలోటు 14.44 బిలియన్ డాలర్లుగా ఉన్నది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఎలక్ట్రానిక్స్, కెమికల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, ఔషధాలకు డిమాండ్ ఉండటం వల్లనే ఎగుమతుల్లో ఈ మాత్రమైన వృద్ధిని సాధించాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

రెండింతలైన పసిడి దిగుమతులు

పసిడి దిగుమతుల జోరు తగ్గడం లేదు. ధరలు గరిష్ఠ స్థాయికి చేరుకున్నప్పటికీ భారత్‌లో అతి విలువైన లోహాల వాడకం మాత్రం తగ్గడం లేదు. ఏప్రిల్ నెలలో 3.11 బిలియన్ డాలర్ల విలువైన పసిడి దిగుమతి చేసుకున్నారు. క్రితం ఏడాది అయిన దిగుమతులతో పోలిస్తే మూడింతలు పెరిగింది. అలాగే క్రూడాయిల్ దిగుమతులు కూడా 20.22 శాతం పెరిగి 16.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి నెలలో ఆశాజనక పనితీరు కనబరిచినట్లు, ఇది భవిష్యత్తులోనూ కొనసాగే అవకాశాలున్నాయని కేంద్ర వాణిజ్య కార్యదర్శి సునీల్ బర్త్వాల్ తెలిపారు. అలాగే 2023-24 ఎగుమతుల గణాంకాలను 778.21 బిలియన్ డాలర్లకు సవరించినట్లు ఆయన చెప్పారు. గత నెలలో 30 కీలక రంగాల్లో 13 విభాగాలు వృద్ధిని నమోదు చేసుకున్నాయని, వీటిలో కాఫీ, తంబాకు, ప్లాస్టిక్, హస్తకళలు ఉన్నాయన్నారు.

వృద్ధి 6.6 శాతం

న్యూఢిల్లీ, మే 15: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధి 6.6 శాతంగా నమోదుకానున్నదని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ అంచనావేస్తున్నది. దేశ ఆర్థిక రంగం పరుగులు పెడుతున్నదని, ముఖ్యంగా రుణ వితరణ బలంగా ఉండటం, బ్యాంకింగేతర ఆర్థిక సేవల సంస్థలు అంచనాలకుమించి రాణించడం కూడా జీడీపీ వృద్ధికి దోహదం చేస్తున్నదని అభిప్రాయపడింది.

గ్రాన్యూల్స్ లాభం 130 కోట్లు

హైదరాబాద్, మే 15: గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రూ.130 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది గ్రాన్యూల్స్ ఇండియా. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.120 కోట్ల కంటే ఇది 8 శాతం అధికం. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.1,195 కోట్ల నుంచి రూ.1,176 కోట్లకు పడిపోయింది. మరోవైపు, రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.15 తుది డివిడెండ్‌ను సంస్థ ప్రకటించింది.

కేంద్రానికి వీఐఎక్స్ గుబులు

మదుపర్ల భయాలను పోగొట్టే పనిలో మంత్రులు సీతారామన్, జయశంకర్

న్యూఢిల్లీ, మే 15: లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వానికి భారతీయ అస్థిరత సూచీ (ఇండియా వీఐఎక్స్) గుబులు పట్టుకున్నది. విపరీతంగా పెరిగిన ఈ సూచీ.. స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులకు నిదర్శనమని, ఈసారి ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం గెలుపు అంచనాలపై మదుపరులలో ఉన్న ఆందోళనల వల్లే ఈ ఆటుపోట్లంటూ మంగళవారం మెజారిటీ మార్కెట్ నిపుణులు విశ్లేషించిన విషయం తెలిసిందే. అయితే దీనిపై ఏమాత్రం ఆలస్యం చేయకుండా మోదీ సర్కారు ఇటు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను, అటు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జయశంకర్‌ను రంగంలోకి దించింది. ఈ క్రమంలోనే జయశంకర్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో, సీతారామన్ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో ప్రసంగిస్తూ వీఐఎక్స్‌ను ప్రస్తావించారు. వ్యాపారులు, స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు ధైర్యాన్ని నూరిపోశారు.

పెట్టుబడులు ఆగవద్దని..

నిజానికి గతకొద్ది నెలలుగా ఈ ఇద్దరు మంత్రుల్ని.. వ్యాపార-పారిశ్రామిక రంగాల పెద్దలను, దేశ-విదేశీ మదుపరులను ఆకట్టుకోవడానికి మోదీ సర్కారు వినియోగించుకుంటున్నది. పెట్టుబడులు ఆగితే అది జనాల్లోకి తప్పుడు సంకేతాలను పంపుతుందని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భయపడుతున్నది మరి. ఇక వీఐఎక్స్‌పై జయశంకర్ మాట్లాడుతూ.. ప్రగతికి ఆస్కారమున్న రంగాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, మోదీ ప్రభుత్వం దానికి పెద్దపీట వేస్తుందని వివరించారు. అంతకుముందు రోజు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లో మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో తమ ప్రభుత్వానికి స్పష్టమైన, బలమైన మెజారిటీ వస్తుందని, దేశాన్ని ముందుకు తీసుకెళ్లే అన్ని నిర్ణయాలను స్వేచ్ఛగా తీసుకోగలుగుతుందని చెప్పారు. బీఎస్ఈలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. 'ఇటీవలి కాలంలో ఒడిదొడుకుల సూచీ హెచ్చుతగ్గుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అన్నారు.

భయమెందుకు?

వీఐఎక్స్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పైకి వ్యాపార, పారిశ్రామిక, పెట్టుబడి వర్గాలకు కేంద్రం చెప్తున్నా.. లోపల మాత్రం భయపడుతూనే ఉన్నది. అందుకే మంత్రుల చేత పదేపదే ఈ అంశంపై మాట్లాడుతూ వస్తున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో, ఎం ఎస్ఎంఈలతో జయశంకర్, సీతారామన్‌లు సమావేశమవుతుండటం గమనార్హం.

వాణిజ్య
Joyalukkas
అమెరికాలో
జోయాలుక్కాస్ స్టోర్లు
హైదరాబాద్, మే 15: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జోయాలుక్కాస్..అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో భాగంగా అమెరికాలో ఐదు షోరూంలను ప్రారంభించబోతున్నది. వీటిలో డల్లాస్, అట్లాంటాలో కొత్త షోరూంలను ప్రారంభించనుండగా, మిగతా మూడు ఆధునీకరించ